సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 28 । మే । 2023



కాలంతో పోటీ.. అర్లి(టి)

సీజనల్ స్పెషల్ ఈ ఊరు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇది. వేసవిలో ఉష్ణోగ్రతలు.. శీతాకాలంలోనూ చలి అధికంగా నమోదు కావడం ఇక్కడి ప్రత్యేకత. 8లో▸

నృత్య'అర్చన'



శాస్త్రీయ నృత్య శిక్షణ కొత్త పుంతలు తొక్కుతోంది. దేశ, విదేశాల్లో, సుదూర ప్రాంతాల్లో ఉంటున్న చిన్నారులకు ఓ శాస్త్రీయ నృత్య శిక్షకురాలు ఆన్‌లైన్‌లో కూచిపూడిలో శిక్షణ ఇస్తుంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.6 /29.5

వాతావరణం

భానుడి ప్రతాపం కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు కనిపిస్తాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత పెరుగుతుంది. ఒకటి రెండు చోట్ల చినుకులు పడొచ్చు

న్యూస్‌రీల్

ఆదాయ పన్ను ఆప్షన్ గడువు పెంపు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను ఆదాయ పన్ను ఆప్షన్ –1 ఇవ్వడానికి చివరి తేదీ పొడిగించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవింద్ రావు తెలిపారు. 2023, ఆగస్టు 29 వరకు ఆదాయ పన్ను ఆప్షన్–1 ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు గనుల్లో లేదా డిపార్టుమెంటుల్లో ఆప్షన్–1 పత్రాలు అందించాలని సూచించారు.

జాతీయ సాహస బాలల అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

పాతమంచిర్యాల: జాతీయ సాహస బాలల అవార్డు–2023 కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికిగాను వివిధ ప్రమాదాల నుంచి ఇతరులను సాహసం చేసి రక్షించిన 6–18 ఏళ్లలోపు బాలబాలికలు జాతీయ సాహస బాలల అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. అక్టోబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.iccw.co.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలు జతచేసి గడువులోగా జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు. వివరాలకు 9441506519 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి ఓఆర్ఎస్, జింక్



ఓఆర్ఎస్, జింక్ అందిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: పిల్లల్లో ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు అవసరమైన మందులు ఇచ్చేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం 5 ఏళ్ల పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ అందించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ పిల్లల్లో డీహైడ్రేషన్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన ఓఆర్ఎస్‌ను అందించడంతోపాటు, చిన్నారుల్లో మోషన్స్‌ను తగ్గించడంతోపాటు, నిమోనియా నుంచి రక్షించేందుకు జింక్ సిరప్, డ్రాప్స్, ట్యాబ్లెట్స్ ఇస్తున్నట్లు వివరించారు. చిన్నారులకు అవసరమైన ఏ విటమిన్‌ను సైతం ఇస్తున్నారని పేర్కొన్నారు. జూన్ 8వ తేదీ వరకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు గుర్తిస్తారని, ఓఆర్ఎస్, జింక్ అందిస్తారని తెలిపారు.

సీవోఈ విద్యార్థికి ఎయిర్ క్రాఫ్ట్ ఇంజినీరింగ్‌లో సీటు



శ్రీనివాస్

బెల్లంపల్లి: పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) కళాశాల విద్యార్థి ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏఎంఈసెట్ –2023)లో సత్తా చాటాడు. కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పంచెర్పుల శ్రీనివాస్ జాతీయ పోటీ పరీక్షలో ప్రతిభ కనబర్చి న్యూఢిల్లీలో సీటు సాధించాడు. ఈమేరకు కళాశాల నుంచి అడ్మిషన్ కార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. శ్రీనివాస్‌ను సంక్షేమ గురుకులాల సంయుక్త కార్యదర్శి కంభంపాటి శారద, ఆర్‌సీఓ కొప్పుల స్వరూపారాణి ప్రత్యేకంగా అభినందించారు.

హనుమాన్ ఆలయానికి వెండి బహూకరణ



వెండి అందజేస్తున్న సమితి సభ్యులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయానికి హనుమాన్ సేవా సమితి సభ్యులు స్వచ్ఛందంగా సేకరించిన మూడున్నర కిలోల వెండిని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వరరావు, పురోహితుడు ఫణికుమార్‌శర్మకు అందించారు. ఈ వెండితో స్వామివారికి ఆభరణాలను చేయిస్తామని అర్చకుడు తెలిపారు. శ్రావణమాసంలో ఈ మహా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, హనుమాన్ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఆకిరెడ్డి భీమయ్య, పెట్టం శ్రీనివాస్, ఇరుకుల్ల పురుషోత్తం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఫిట్‌నెస్ కోసం వచ్చిన విద్యా సంస్థ బస్సును పరిశీలిస్తున్న ఎంవీఐ వివేకానందరెడ్డి (ఫైల్)



ఫిట్.. స్లో!

జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల బస్సులు	361
ఒక్క మంచిర్యాలలోనే ఉన్న బస్సులు	210
ఇప్పటి వరకు ఫిట్‌నెస్ అయిన బస్సులు	38
ఇంకా ఫిట్‌నెస్ కావాల్సిన బస్సులు	323

- జూన్ 15 వరకు ఫిట్‌నెస్ పరీక్షలకు గడువు
- సమయం ఉండటంతో ముందుకురాని యాజమాన్యాలు
- జిల్లా వ్యాప్తంగా 361 విద్యాసంస్థల బస్సులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యాసంస్థల వేసవి సెలవులు చివరి దశకు చేరుకున్నాయి. జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందంటే చాలు ముఖ్యంగా గుర్తు వచ్చేది... బస్సుల ఫిట్‌నెస్. జిల్లాలో ఫిట్‌నెస్ పరీక్షలు నత్తనడకన సాగుతున్నాయి. అడ్మిషన్లపై యాజమాన్యాలు చూపుతున్న స్పీడ్‌ను వాహనాల ఫిట్‌నెస్ చేయించడంపై చూపడం లేదు. వాస్తవంగా మేలోనే రవాణా అధికారులు విద్యాసంస్థల ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభిస్తారు. జూన్ 1 నాటికి పూర్తి చేస్తారు. ఈఏడాది కూడా మేలో పరీక్షలు ప్రారంభించినా విద్యాసంస్థల యాజమాన్యాలు స్పందించకపోవడంతో నత్తనడకన సాగుతున్నాయి.

గడువు ఉంది కదా అని..

బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా రవాణా శాఖ సిద్ధంగా ఉంది. కానీ విద్యా సంస్థలు ప్రారంభం కాలేదని ఇప్పుడే తొందర ఎందుకన్న ధోరణిలో విద్యాసంస్థల యాజమాన్యాలు ఉన్నాయి. మరో నాలుగు రోజుల్లో మే నెల ముగియనుంది. ఇప్పటి వరకు కేవలం 38 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలకు వచ్చినట్లు రవాణా అధికారులు చెబుతున్నారు. జిల్లాలో విద్యా సంస్థల బస్సులు మొత్తం 361 ఉన్నాయి. పక్షం రోజుల్లో 323 వాహనాలకు పరీక్షలు చేయాల్సి ఉంటుంది. జూన్ 12 తర్వాత ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కే వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యా సంస్థల యజమాన్యాలు త్వరగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఫిట్‌నెస్ నిబంధనలు ఇవీ..

- బస్సు మంచి కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలి. 15 ఏళ్ల జీవిత కాలం దాటని బస్సు అయి ఉండాలి. బస్సుకు పసుపు రంగు తప్పనిసరిగా ఉండాలి.
- బస్సు స్టీరింగ్, బ్రేకులు, టైర్లు, ఇండికేటర్లు, వైపర్లు, అత్యవసర ద్వారం, కిటికీలకు గ్రిల్స్ అమర్చడం, పిల్లలు బస్సు ఎక్కేందుకు, దిగేందుకు అనువుగా ఉండాలి.
- ముఖ్యంగా డ్రైవర్ ఆరోగ్యంగా ఉండాలి. నెలకోసారి బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించాలి. తాగి వాహనం నడపకుండా చూడాలి. డ్రైవర్‌కు లైసెన్స్ విధిగా ఉండాలి.
- ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి. సైడ్ మిర్రర్లు, లైట్లు, బస్సు వెనక ఎరుపు రంగు రేడియం టేపు, ముందు తెలుపు రంగు రేడియం అతికించి ఉండేలా చూడాలి.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్..



జూన్ 12 వరకు గడువు ఉన్నా బస్సుల ఫిట్‌నెస్ త్వరగా పూర్తి చేసుకోవాలని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచిస్తున్నాం. ఫిట్‌నెస్ కోసం బస్సులు సమయానికి వస్తే వెంటనే చేసి పంపిస్తాం. అన్ని పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు జరిపించుకుని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి పొందాలి. బస్సులను పక్కాగా పరిశీలించాకే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు ఇస్తాం. నిబంధనలు పాటించని బస్సులు రోడ్లపైకి రావొద్దు. ఫిట్‌నెస్ లేని వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తాం.
– ఎల్.కిష్టయ్య, డీటీవో, మంచిర్యాల

ప్రభుత్వ బడుల్లో లైబ్రరీలు..!



ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పుస్తకాల పంపిణీ (ఫైల్)

- మొదటి దఫాలో 152 పాఠశాలలు ఎంపిక
- జూన్ 20న ప్రారంభించేందుకు సన్నాహాలు
- రీడింగ్ కార్నర్ల ఏర్పాటులో విద్యాశాఖ తలమునకలు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించి, ధారళంగా చదివేలా తయారు చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రీడింగ్ కార్నర్లు(లైబ్రరీ) ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 20న విద్యా దినోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో మొదటి దఫాలో మన ఊరు–మనబడికి ఎంపిక చేసిన 152 పాఠశాలల్లో ఈ లైబ్రరీలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు పుస్తకాలతో కూడిన బుక్‌షెల్ఫ్, కార్పెట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థతోపాటు నేషనల్ బుక్ ట్రస్టు ముద్రించిన కథల పుస్తకాలు, పర్యావరణం, జంతువులు, పక్షులు తదితర అంశాలపై అవగాహన పెంచేందుకు ప్రచురించిన పుస్తకాలు ఇందులో ఉంచనున్నారు.

లైబ్రరీలో ఇలా..

తరగతి గదిలోని ఒకమూలను రీడింగ్ కార్నర్‌గా అలంకరిస్తారు. మన ఊరు–మన బడిలో ఎంపికైన 149 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత పాఠశాల్లో ఈ లైబ్రరీలు ఏర్పాటు కానున్నాయి. రూం టూ రీడ్ నుంచి వచ్చిన 70 స్టోరీ పుస్తకాలు, 50 స్టోరీ కారక్డ్స్, 12 బిగ్ స్టోరీ బుక్స్, ఏడు పోస్టర్, నేషనల్ బుక్ ట్రస్టు నుంచి వచ్చిన 104 ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ తోపాటు పుస్తకాలు అందజేయనున్నారు. 152 పాఠశాలల్లోనే మండలానికి రెండు చొప్పున ఎంపిక చేసిన 35 పాఠశాలలున్నాయి. ఇప్పటికే ఆయా స్కూళ్లకు కార్పెట్ పంపిణీ చేశారు. హాజీపూర్ మండలం సబ్బెపల్లి, పడ్తన్‌పల్లి, మంచిర్యాలలోని న్యూగర్శిప్ల, రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, నస్పూర్‌లోని తీగల్‌పహడ్ పాఠశాలలకు వుడెన్ ర్యాక్‌లు సరఫరా చేశారు.

51 స్కూల్ కాంప్లెక్స్‌లలో..

జిల్లాలో 51 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఇందులో ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 16 నుంచి 20 పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో కాంప్లెక్స్‌కు 800 నుంచి 1000 పుస్తకాలు అందజేయనున్నారు. ప్రతీనెల 50 పుస్తకాలు (రొటేషన్ బ్యాగు) ఆయా పాఠశాలలకు రొటేషన్ చేయనున్నారు. ఇలా అన్ని పుస్తకాలు అన్ని పాఠశాలల విద్యార్థులకు చేరువయ్యేలా చర్యలు చేపట్టనున్నారు. పుస్తకాలు చదవటంలో పిల్లలకు పోటీలు నిర్వహించనున్నారు. స్టోరీ టెల్లింగ్ , బిగ్గరగా చదవించనున్నారు. నిత్యం పుస్తకాలు చదవటం ద్వారా వాటి ప్రాముఖ్యం తెలుస్తుంది. పుస్తక పఠనం అలవాటుకు లైబ్రరీలు ఎంతగానో దోహదం చేస్తాయని డీఈవో యాదయ్య తెలిపారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి..

జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి రూం టు రీడ్ అనే సంస్థ ద్వారా 579 పాఠశాలల్లో రీడింగ్ కార్నర్ ప్రారంభించనున్నారు. 485 ప్రాథమిక, 94 ప్రాథమికోన్నత పాఠశాలల్లో సెరీ కార్యక్రమంలో భాగంగా 153 బుక్స్ బ్యాగ్స్ జిల్లాకు చేరాయి. ప్రతీ స్కూల్ కాంప్లెక్స్‌కు మూడు బ్యాగుల చొప్పున (51x3 బ్యాగ్స్ =153 బ్యాగ్స్) స్వయంగా పంపిణీ చేయనున్నారు. ప్రతీరోజు లైబ్రరీ పీరియడ్‌లో ఈ పుస్తకాలను చదివిస్తారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: సీఎం కప్ 2023 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు శనివారం హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. అడిషనల్ కలెక్టర్ బి.రాహుల్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో క్రీడాకారులు, కోచ్‌లకు లంచ్ తోపాటు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. జిల్లా నుంచి హ్యాండ్‌బాల్ పోటీలకు 12 మంది పురుషులు, 12 మంది మహిళలు వెళ్లగా, టేబుల్ టెన్నిస్‌కు ముగ్గురు చొప్పున పురుషులు, మహిళలు వెళ్లారు. లాన్ టెన్నిస్‌కు ముగ్గురు చొప్పున మహిళలు, పురుషులు, బాక్సింగ్‌కు నలుగురు పురుషులు, వెయిట్ లిఫ్టింగ్‌కు నలుగురు పురుషులు, అథ్లెటిక్స్‌కు నలుగురు చొప్పున మహిళలు, పురుషులు, ఫుట్‌బాల్ విభాగంలో 16 చొప్పున మహిళలు, పురుషులు, స్విమ్మింగ్‌లో నలుగురు పురుషులు, బ్యాడ్మింటన్‌లో పురుషులు 3, మహిళలు 5, వాలీబాల్‌లో 10 చొప్పున పురుషులు, మహిళలు, కబడ్డీకి 10 మంది చొప్పున పురుషులు, మహిళలు, ఖోఖోకు 12 చొప్పున పురుషులు, మహిళలు, బాస్కెట్‌బాల్‌కు 12 మంది పురుషుల జట్టు, సభ్యులతోపాటు 23 మంది కోచ్‌లు వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, పలు క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



జెండా ఊపి సాగనంపుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

రక్తదానానికి ముందుకు రావాలి

- అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మంచిర్యాలటౌన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు సకాలంలో రక్తం అందించేందుకు రక్తదానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. జిల్లా రెవెన్యూ సర్వీసెస్, తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్లు మధుసూదన్ నా యక్, రాహుల్ హాజరయ్యారు. ప్రభుత్వ జనరల్ ఆ సుపత్రిలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ద్వారా తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు సరిపడా రక్తనిల్వలు తగ్గడంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 112 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసరి వేణు, రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు ఇత్యాల కిషన్, కార్యదర్శి ఎల్.కృష్ణ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ చందూరి మహేందర్, మధుసూదన్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, కాసర్ల రంజిత్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో అదనపు కలెక్టర్

గేటెడ్.. గో(తి)ప్పలు!

జిల్లా కేంద్రానికి సమీపంలో.. రామకృష్ణాపూర్ పట్టణ పరిధి గద్దెరాగిడి శివారులో అమ్మ బృందావనం పేరుతో గేటెడ్ కమ్యూనిటీ ఇళ్ల నిర్మాణానికి 2019లో శ్రీకారం చుట్టారు. ఈమేరకు విస్తృతంగా ప్రచారం చేశారు. రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, గుడి, క్లబ్, స్విమ్మింగ్‌పూల్, లైటింగ్ సిస్టం తదితర హైటెక్ సదుపాయాలతో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. 12 మంది విడతల వారీగా నిర్మాణ సంస్థకు రూ.లక్షల్లో చెల్లించారు. నాలుగేళ్లు గడిచినా అక్కడ ఒక్క ఇల్లు కూడా పూర్తి చేయలేదు. అగ్రిమెంట్ ప్రకారం ఏడాదిలోపే పూర్తి చేయాలి. బాధితులు ఇటీవల డీసీపీకి ఫిర్యాదు చేశారు. కొందరు తమ సొంత డబ్బులతోనే మిగిలిన నిర్మాణం పూర్తి చేసుకుని అసౌకర్యాల మధ్యే ఉంటున్నారు.

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఓ అపార్ట్ మెంట్‌లో ఫ్లాట్లు నిర్మాణం పూర్తి కాకముందే అమ్మకానికి పెట్టారు. పది మంది వరకు ముందస్తుగా కొనుగోలు చేశారు. అయితే ఆరేళ్లు గడిచినా కొనుగోలుదారులకు ఫ్లాట్లు అప్పగించలేదు. నిర్మించి ఇస్తామని చెప్పిన యజమాని రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నాడని కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గద్దెరాగిడిలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో నిలిచిపోయిన నిర్మాణాలు

- నిర్మాణ సంస్థలు చెప్పేదొకటి చేసేది మరోటి
- నిండా మునుగుతున్న కొనుగోలుదారులు
- పెరుగుతున్న 'రియల్' మోసాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో 'రియల్' మోసాలు పెరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ సంస్థలు కొనుగోలుదారులకు చెప్పేదొకటి, చేసేది మరొకటి అన్నట్లుగా మారుతోంది. జిల్లాలో రియల్ వ్యాపారం వేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో అనేక చోట్ల ఓపెన్ ప్లాట్ల నుంచి గేటెడ్ కమ్యూనిటీ పేరుతో విలాసవంతమైన ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానికులతోపాటు హైదరాబాద్ నుంచి బడా వ్యాపారులు రంగంలో దిగడంతో పోటీ పెరిగింది. ఒకరికి మించి ఒకరు అన్నట్లుగా మారింది. ఆచరణలో సాధ్యం కానివి కూడా చెబుతూ కొనుగోలుదారులను నమ్మిస్తున్నారు. జిల్లా కేంద్రం శి వారు, సమీప గ్రామాలతోపాటు పట్టణాలు, జాతీ య రహదారుల వెంట, అగ్రిఫాం ల్యాండ్స్, విల్లాలు, డూప్లెక్స్ హౌస్, లగ్జరీ ఇళ్ల పేరుతో ప్రచారం చేస్తూ ప్రజల్ని ఆకర్షిస్తున్నారు. అయితే రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఇటీవల కొందరు రియల్ వ్యాపారులపై కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. చివరకు పోలీసు స్టేషన్లలో కేసు నమోదు చేస్తున్నారు.

కొనుగోలు చేశాక తిప్పలు

సొంతి ఇల్లు ఉండాలనే ఆశతో చాలా మంది తక్కువ ధర కోసం అనుమతులు ఉన్నా, లేకున్నా అమ్మకందారుల మాటలు నమ్మి నిండా మునిగిపోతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ, సింగరేణి ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. 'నాలా', డీటీసీపీ అనుమతి, పైఅంతస్తులకు, పట్టణ, గ్రామ పాలకవర్గాల అనుమతులు తీసుకోవాలనే నిబంధనలు చాలా చోట్ల అమలు కావడం లేదు. నస్పూర్, ఆర్కేపీ లాంటి పట్టణాల్లో ఇప్పటికీ గ్రామపంచాయతీగా ఉన్నప్పటి ఇంటి నంబర్లతో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం చేస్తున్నారు. ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న చోట్ల ఇంటి నంబర్ల గోల్‌మాల్ జరుగుతోంది. గతంలో మంచిర్యాల పట్టణంలో ఓ కొనుగో లుదా రుడు అప్పు చేసి ఇల్లుకు డబ్బులు చెల్లించామని, బిల్డర్ సకాలంలో పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాడని కొత్త ఇంటి ముందే వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. పై అంతస్తులకు అనుమతి లేకుండా నిర్మించి, ఇంటి రుణ సదుపాయం పొందలేని పరిస్థితులు వస్తున్నాయి.

పర్యవేక్షణ కరువు

జిల్లా కేంద్రంతోపాటు, మున్సిపాలిటీలు, గ్రామాలు, జాతీయ రహదారుల వెంట లక్సెట్టిపేట నుంచి హాజీపూర్, మంచిర్యాల, జైపూర్ మండలాల్లోని గోదావరి తీరం, జాతీయ రహదారుల వెంట సాగు భూముల్లోనే విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీల పేరుతో ప్రచారం చేస్తున్నారు. సంస్థ ఇస్తున్న బ్రోచర్లు, ఏజెంట్లు చెప్పినట్లు క్షేత్రస్థాయిలో ఉండడం లేదు. కొన్నిచోట్ల ఏళ్ల క్రితమే కాలనీలు కట్టిస్తామని, రూపురేఖలు మారుస్తామని చెప్పి ఇప్పటికీ ఆయా వెంచర్లలో ఒక్క ఇల్లు నిర్మించలేదు. ఇక కొన్నిచోట్ల అమ్ముకుందామన్నా, రీసేల్ కూడా ఉండడం లేదు. సాగు భూములను కొనుగోలు చేసి, చదును చేస్తున్నప్పటి నుంచే ప్లాట్ల అమ్మకాలు చేస్తున్నారు. ప్లాన్ చూపిస్తూ, ఒక్కొక్కరికి ఒక్కో ధరలకు అమ్మేస్తున్నారు. వీటిపై స్థానిక గ్రామ, పట్టణ పాలక సంస్థలు, కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. ఇలాంటి సంస్థలపై కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండడమే కాకుండా, మోస పోకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కలెక్టరేట్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి



కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్,ఎమ్మెల్యే దివాకర్‌రావు



నస్పూర్ బహిరంగ సభా స్థలి వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

నస్పూర్: సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్‌లతో కలిసి శనివారం పరిశీలించారు. వివిధ శాఖల కార్యాలయాలు, వివిధ సేవల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు వేచి ఉండే ప్రాంతాలు, భవనం ఆవరణ, సమావేశ మందిరం పరిశీలించారు. జూన్ 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో పెండింగ్ పనులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ, విద్యుత్, హార్టికల్చర్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో వేణు, డీఆర్డీవో శేషాద్రి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ

నస్పూర్: సీఎం కేసీఆర్ జూన్ 9న జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ శనివారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ తన పర్యటనలో భాగంగా నస్పూర్‌లో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. నస్పూర్‌లో లక్ష మందితో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ స్థలం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ భవనానికి వెళ్లే అంతర్గత రహదారులను, భద్రతా ఏర్పాట్లను డీసీపీ పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ ఉన్నారు.

పల్లె దవాఖానాల తనిఖీ

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని చందారం, జెండా వెంకటపూర్ గ్రామాల్లోని పల్లె దవాఖానాలను జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు శనివారం తనిఖీ చేశారు. నిర్వహణ, పనితీరు, నియామకమైన ఎంఎల్‌హెచ్‌పీల పని తీరును అడిగి తెలుసుకున్నారు. నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. లక్సెట్టిపేటలో వ్యాక్సినేషన్ సెంటను పరిశీలించారు. ఆయన వెంట వైద్యసిబ్బంది, నాందేవ్, లక్ష్మణస్వామి, రత్నకుమారి, శాంతకుమారి ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారి

కాలంతో పోటీ.. అర్లి(టి)

• సీజనల్ స్పెషల్.. ఈ ఊరు • ఏటా రికార్డుస్థాయి పగటి ఉష్ణోగ్రతలు • శీతాకాలంలోనూ చలి అధికం • భౌగోళిక పరిస్థితులే కారణం

సండే స్పెషల్

సాక్షి, ఆదిలాబాద్ డెస్క్: సీజనల్ స్పెషల్ ఈ ఊరు. జిల్లాలోనే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇది. వేసవిలో ఉష్ణోగ్రతలు.. శీతాకాలంలోనూ చలి అధికంగా నమోదు కావడం ఇక్కడి ప్రత్యేకత. ఓ సీజన్‌లో గజగజ వణికిస్తూ.. మరో సీజన్‌లో నిప్పుల కుంపటిని తలపించే ఆ ఊరే ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అర్లి(టి).



గ్రామంపై కప్పుకున్న పొగమంచు(ఫైల్)

భౌగోళిక అంశాలే..

భౌగోళికపరంగా ఈ గ్రామం సముద్రమట్టానికి 286 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఇది పూర్తిగా బండ ప్రాంతం. అలాగే ఓ వైపు అటవీ ప్రాంతం మరోవైపు ఎత్తైన ఐదు కొండలు పరుచుకుని ఉన్నాయి. వేసవిలో సూర్య ప్రభావంతో వేడెక్కిన గుట్టలతో ఉష్ణోగ్రత పెరిగి గరిష్ఠంగా నమోదవుతుంటుంది. ఇక చలికాలంలో శీతల గాలులు, మంచు ప్రభావం కొండల సరిహద్దుకే పరిమితం అవడంతో ఈ ప్రాంతంపై అధిక ప్రభావం చూపుతోంది. దీంతో స్థానికులను చలి వణికిస్తుంది.



చలిమంట కాగుతున్న వృద్ధురాలు(ఫైల్)

అలాగే వర్షాకాలంలోనూ అటవీప్రాంతం, కొండల ప్రభావం, పెన్‌గంగా ప్రవాహం కారణంగా వర్షపాతం కూడా అధికంగానే నమోదవుతుంది.

వేసవిలో మండే ఎండ..



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా అర్లి(టి)

ఇక సమ్మర్‌లో ఉదయం ఏడు దాటిందంటే చాలు.. వేడి దడ పుట్టిస్తోంది. రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈ ఏడాది ఇప్పటికే 45 డిగ్రీల మార్కుకు చేరువైంది. ఈ సీజన్‌లో చేను పనులు ఉదయం 5 నుంచి మొదలై 10 గంటలకు ముగుస్తాయి. మధ్యాహ్నం గ్రామస్తులు అంతా ఇళ్లలోనే గడుపుతారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తాయి. స్థానికులు చల్లదనం కోసం తొగరి కట్టెలతో పందిరి ఏర్పాటు చేసుకుంటారు.

చలికాలం.. మరో ఊటి

చలికాలం తీవ్రమైన చలి ఉంటుంది. సూర్యోదయ సమయంలో మంచుదుప్పటి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పొగమంచు ప్రభావంతో ఈ ప్రాంతం చూపరులను కనువిందు చేస్తోంది. ఇక్కడ 2021లో రికార్డుస్థాయిలో 3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో స్థానిక బస్టాప్ వద్ద 24 గంటలు చలిమంటలు ఏర్పాటు చేస్తారు. ఈ సమయంలో ఆవులకు గోనె సంచులతో చేసిన దుస్తులు వేయడం ప్రత్యేకత. చలి నుంచి రక్షణ కోసం స్థానికులకు గొంగళ్లు పంపిణీ చేస్తుంటారు. వేకువజామున కొంచవల్లి దర్గా, రాముల గుట్ట నుంచి చూస్తే మంచుతెరలతో ప్రకృతి కనువిందు చేస్తోంది. డిసెంబర్‌లో ఒక వారంలో సూర్యుడు మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకే అస్తమిస్తాడు. రెండు, మూడు రోజులయితే భానుడు అసలే కనిపించడని స్థానికులు చెబుతుంటారు.



చలికాలంలో కమ్ముకున్న పొగమంచు



చలికాలంలో పశువులపై కప్పిన గన్నీ దుస్తులు (ఫైల్)

గ్రామంలో చలి, ఎండ ఎక్కువ..



మా ఊర్లో చలికాలంలో చలి, ఎండాకాలంలో ఎండ రికార్డుస్థాయిలో ఉంటది. వర్షం కూడా ఎక్కువే. వాతావరణం ఎలా ఉన్నా తట్టుకోవడం అలవాటు చేసుకున్నాం. చలి కాలంలో జాగ్రత్తలు తీసుకుంటాం. చలిమంటల ద్వారా ఉపశమనం పొందుతాం. ఆవులకు గోనెసంచుల దుస్తులు వేస్తాం. ఇప్పుడైతే ఎండ దంచి కొడుతుంది. ఇప్పటికే ఎండ 45 డిగ్రీలకు వచ్చిందటున్నరు.

– పిట్ల దేవారెడ్డి, అర్లి(టి) గ్రామం

చుట్టూ రాతి గుట్టల కారణంగానే..



అర్లి(టి)లో భిన్నమైన వాతావరణానికి భౌగోళిక పరిస్థితులే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రామం చుట్టూ ఎత్తైన రాతి గుట్టలు ఉన్నాయి. వేసవిలో ఎండల కారణంగా ఈ గుట్టలు వేడెక్కి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే సమీపంలోనే పెన్‌గంగతో పాటు అటవీప్రాంతం ఉండడంతో శీతాకాలంలో చలిసైతం రికార్డుస్థాయిలో నమోదవుతుంది. వర్షపాతం కూడా అధికంగా ఉన్నందున రెయిన్‌గేజ్ ఏర్పాటు చేశాం.

– వెంకటరమణ, సీపీవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడి మృతి



బోడకుంటి మల్లన్న (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గుడిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోడకుంటి మల్లన్న(48) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. వివరాల ప్రకారం... దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌కు చెందిన మల్లన్న పది సంవత్సరాలుగా గుడిపేట ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంలోనే కాకుండా ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉండేలా విశేష కృషి చేశాడు. గ్రామంలోనూ అందరితో కలిసి ఉంటూ పిల్లల చదువులో ప్రత్యేక చొరవ చూపేవాడు. మల్లన్న ఏడాదిగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉన్నారని ఈ క్రమంలో శనివారం ఆరోగ్య పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లన్న ప్రస్తుతం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా కొనసాగుతుండగా మృతుడికి భార్య సత్యలీల, కుమార్తె శిరీషా, కుమారుడు అవినాశ్ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



రమేష్ మృతదేహం

లక్సెట్టిపేట: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణ పరిధిలోని ఇటిక్యాలలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం... మాదాసు రమేశ్(46) ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. ఈ నెల 24న మనస్తాపానికి గురై పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పురుగుల మందు తాగి యువకుడు..

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూర్‌కు చెందిన గుండారపు శ్రీనివాస్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీనివాస్ లక్సెట్టిపేటలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతడికి ఇంకా పెళ్లి కాలేదు. ఈ విషయంలో ఈ నెల 25న దుకాణం నుంచి రాత్రి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు పెళ్లి విషయం ప్రస్తావించారు. దీంతో కోపంతో గదిలోకి వెళ్లి పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలోని భీమన్న ఆలయం వద్ద పేకాటాడుతున్న పలువురిని సీఐ షాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేష్ ఆధ్వర్యంలో దాడిచేసి శనివారం పట్టుకున్నారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జాతీయ విశిష్ట సేవారత్న అవార్డుకు శ్రీపతి ఎంపిక



అవార్డు అందుకుంటున్న శ్రీపతి

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లాకు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి శనివారం జాతీయ విశిష్ట సేవా రత్న అవార్డును అందుకున్నారు. ఎస్ఎస్‌బీఎం ఆధ్వర్యంలో గోవా పట్టణంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఎస్ఎస్‌బీఎం మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్, జున్ను ఇర్మియ అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రామగిరి శ్రీపతి మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘం ద్వారా సమాజంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులుగా చేసినందుకే అవార్డుకు ఎంపిక జేశారన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు అట్కాపురం రాయలింగు, ఐత పరమేశ్వర్, చాపిడి సందీప్, ఎల్కపల్లి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య



నారాయణ(ఫైల్)

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టకిరే నారాయణ(50) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నారాయణ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక శనివారం తెల్లవారు జామున పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య సంతర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు వెళ్లకముందే... గేటు తెరిచారు

• తప్పిన పెనుప్రమాదం



గేటు తీయడంలో లోపలకి వెళ్లిన వాహనాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో బుర్దగూడెం రైల్వేట్రాక్ వద్ద పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారి దేవాపూర్ రైల్వేట్రాక్‌లో శనివారం ఉదయం దేవాపూర్ నుంచి మందమర్రి వైపు గూడ్స్ రైల్ వస్తుందని గేట్ వేశారు. దీంతో జాతీయహదారిపై రైల్వేగేట్ వద్ద వాహనాలు నిలిపారు. గూడ్స్ రైలు పూర్తిగా వెళ్లిపోకముందే అక్కడ గేట్‌ట్రోల్ నిర్వాహకుడు గేట్ తెరిచాడు. దీంతో వాహనదారులు రైల్ వెళ్తుండగానే గేట్‌దాటి లోపలికి వెళ్లారు. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలే జాతీయ రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. గేటు తీసే సమయంలో నిబంధనలు పాటించకపోవడం ఏమిటని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గోలేటి టౌన్‌షిప్ లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమవేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించబోయే ప్రజా గర్జన ముగింపు కార్యక్రమానికి పెద్ద ఎత్తున సింగరేణి కార్మికులు తరలి రావాలని అన్నారు. లాభదాయకమైన వేజ్‌బోర్డుకు కృషి చేసిన పర్మినెంట్ వేజ్‌బోర్డు సభ్యులు సీతారామయ్యను గోలేటి బ్రాంచి నాయకులు సన్మానించారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బ్రాంచి ఇన్‌చార్జి నర్సయ్య, కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, చంద్రశేఖర్, కిరణ్‌బాబు, శ్రీనివాస్, ఆనంద్, ఫిట్ కార్యదర్శులు మల్లేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ప్రత్యేక చొరవతోనే....

జైపూర్: ఏఐటీయూసీతో మెరుగైనవేజ్‌బోర్డ్ ఒప్పందం జరిగిందని ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఎస్టీపీసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్‌కుమార్, బాజీసైదా, వీరభద్రయ్య, సమ్మయ్య ఉన్నారు.

మెరుగైన వేజ్‌బోర్డు సాధించాం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని వేజ్‌బోర్డు ఒప్పందం బొగ్గు పరిశ్రమలో చేయించుకున్నామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర పరిశ్రమల్లో వేజ్‌బోర్డు కాలపరిమితి 10సంవత్సరాలు ఉండగా బొగ్గు పరిశ్రమల్లో మాత్రం 5సంవత్సరాలకే ఉండేలా ఒప్పందం చేశామని అన్నారు. కార్మికులకు మెరుగైన వేజ్‌బోర్డు ఒప్పందం జరిగినా వేజ్‌బోర్డుపై దుష్ప్రచారం చేస్తున్న సంఘాలకు తగిన బుద్ధి చెప్పాలని కార్మికులను కోరారు. వేజ్‌బోర్డు ఒప్పందంపై సంతకం చేసిన హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ హైమద్ సైతం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర సంస్థలో కాలపరిమితి 10 సంవత్సరాలు ఉండి వేతనాల పెరుగుదల 12 నుండి 15 శాతం ఉంటే బొగ్గు పరిశ్రమల్లో కాల పరిమితి 5 సంవత్సరాలకు ఒప్పించి 19 శాతం వేతనాల పెరుగుదలతో పాటు 25 శాతం అలవెన్సులపై పెంచి ఒప్పందం జరిగితే అవగాహన లేని టీబీజీకేఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శివరావు, శ్రీనివాస్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, ఫిట్ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

వడదెబ్బకు సొమ్మసిల్లిన ఐకేపీ వీవోఏ



వడదెబ్బకు గురై చికిత్స పొందుతున్న వీవోఏ సంతోష్

నెన్నెల: మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు చేస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొన్న మెట్‌పల్లి గ్రామానికి చెందిన వీవోఏ దుగుట సంతోష్ శనివారం దీక్షా శిబిరంలో వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన తోటి వీవోఏలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. వీవోఏలు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి నుంచి సంతోష్ బైక్‌పై ఎండకు 15 కిలో మీటర్ల ప్రయాణం చేసి దీక్ష శిబిరానికి చేరుకున్నాడు. 15 నిమిషాల తర్వాత దాహం వేస్తుందని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పి పడిపోయాడు. చికిత్స అందించిన తర్వాత కోలుకున్నట్లు తోటి వీవోఏలు చెప్పారు. 41 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీవోఏల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని నెన్నెల మండల ఐకేపీ వీవోఏలు కోరుతున్నారు.

జూన్ 4న చలో కొత్తగూడెం

• ఏఐటీయూసీ కేంద్రకార్యదర్శి ముస్కె సమ్మయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చలో కొత్తగూడెం కార్యక్రమం చేపట్టినట్లు ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 5 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సాయంత్రం ప్రజాగర్జన పేరుతో బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి లక్ష మందిని సమీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమను తెగ నమ్ముతూ ప్రైవేటీకరణ కాంట్రాక్టీకరణతో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. 44 చట్టాలను నాలుగు కోడ్‌ల కింద తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేశారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 11వ వేతన ఒప్పందంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కంపెనీ వాస్తవ లాభాలను ప్రకటించి అందులో 35శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెంకు వెళ్లడం కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. జూన్ 4 ఉదయం 8 గంటలకు బెల్లంపల్లి నుంచి ప్రారంభమై మంచిర్యాల మీదుగా కొత్తగూడెంకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవీందర్ ఉన్నారు.

ఆశవర్కర్ ఆత్మహత్య



మెంగుబాయి మృతదేహం

కెరమెరి(ఆసిఫాబాద్): పురుగుల మందుతాగి ఆశవర్కర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని జోడే ఘాట్ గ్రామ పంచాయతీలోని శివగూడ గ్రామానికి చెందిన టేకం మెంగుబాయి(30) భర్త టేకం మానిక్‌రావుతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం పొలం పనులు చేసింది. మధ్యాహ్నం సమయంలో భర్త పనుల నిమిత్తం కెరమెరికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన మెంగుబాయి పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబీకులు కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. కాగా టేకం మానిక్‌రావుకు ముగ్గురు భార్యలు. వారిలో చిన్న భార్యా టేకం మెంగుబాయి ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. భర్త మానిక్‌రావు కెరమెరికి వెళ్లిన తరువాత ఇంట్లో ఏమైన గొడవలు జరిగాయా? లేదా.. ఇంకేదైన కారణం ఉందా? అనే విషయం తెలాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై నల్లా వెంకటేశ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పాడు.

నార్లాపూర్‌లో వ్యక్తి హత్య



బుజ్జి మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్లాపూర్‌లో శనివారం ముంజంపల్లి పోశం అలియాస్ బుజ్జి(50) దారుణహత్యకు గురయ్యాడు. సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం... ముంజంపల్లి పోశం తన తమ్ముడి కొడుకైన ముంజంపల్లి సురేష్ ఇంటి పక్కకే నివాసం ఉంటున్నారు. మధ్యాహ్నం సమయంలో సురేష్ భార్య స్వప్న బావి దగ్గరకు నీటి కోసం వెళ్లినప్పుడు పోశం అసభ్యకరంగా మాట్లాడాడు. సాయంత్రం సురేష్‌కు జరిగిన విషయాన్ని స్వప్న చెప్పింది. దీంతో సురేష్ రోడ్డుపై ఉన్న పోశంను వాళ్లింటికి లాక్కెళ్లి దాడిచేయగా ఇంట్లోని గుమ్మానికి తల తగిలి తీవ్రగాయమై మృతిచెందాడు. మృతుడి భార్య 20ఏళ్ల క్రితమే చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చల్లని ఉపాయం



నస్పూర్‌కాలనీకి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి గోళ్ల శంకరయ్య చల్లదనం కోసం తన ద్విచక్రవాహనానికి గొడుగులాంటిది ఏర్పాటు చేశారు. నీడతో పాటు, చల్లదనం ఉండాలని పర్యావరణ పరిరక్షణలో భాగంగా బైక్‌కు రెండు వైపులా మొక్కలు ఏర్పాటు చేసుకుని, ఆ మొక్కలు గొడుగుల ఏర్పాటు చేసుకున్నదానికి ఆ మొక్క తీగలు పారేలా ఏర్పాటు చేశాడు. మనీప్లాంట్ మొక్క తీగల రూపంలో పెరుగుతుండగా, ఆ తీగలను చల్లదనం వచ్చేందుకు వినియోగిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శంకరయ్య దివ్యాంగుడిగా మారడంతో ఎక్కడికి వెళ్లాలన్నా స్కూటీనే వినియోగిస్తుండడం, వేసవి కాలం వేడిని తట్టుకోవడంతో పాటు, వానాకాలంలోనూ రక్షణగా ఉండేలా దీనిని స్వయంగా ఏర్పాటు చేసుకున్నాడు.

- మంచిర్యాలటౌన్